నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

అడుగడుగునా ఆటంకం

- అంగన్వాడీల చలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు
- కార్యకర్తలను రైలు నుంచి దించి అరెస్టు
- నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వావాదం
- సిపిఎం జిల్లా కార్యదర్శిపై ఎస్ఐ దాడికి యత్నం
- రైల్వేస్టేషన్‌లోనే బైఠాయించిన అంగన్వాడీలు
- 15 మంది అరెస్టు, విడుదల
- 41వ రోజూ కొనసాగిన సమ్మె

అంగన్వాడీలు 41 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈనెల 22న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికిపోలీసులు అడుగడుగునా ఆటంకం కల్గించారు. పెద్దతిప్ప సముద్రం రైల్వేస్టేషన్‌లో అంగన్వాడీలు చలో విజయవాడకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు రైలు నుంచి దించి అక్రమంగా అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులపై రూరల్ ఎస్ఐ సుధాకర్ దాడికి యత్నించారు. ఆయన వైఖరిని నిరసూ్త అంగన్వాడీలు ప్లాట్‌ఫామ్‌పై బైఠాయించి నిరసన తెలియజేశారు. కొన్ని సెంటర్లలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించి తమ నిరసనను తెలియజేశారు.

మదనపల్లి : అంగన్వాడీలు , సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లి

41 రోజులుగా రోజులుగా సమ్మె చేస్తున్నా అంగన్వాడీల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి ఈనెల 22న విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. ఆదివారం స్థానిక పిటిఎం రైల్వేస్టేషన్‌లో విజయవాడ బయ లుదేరిన అంగన్వాడీలను పోలీసులు బలవంతంగా రైలు ఎక్కుతున్న మహిళలను దింపివేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, అంగన్వాడీలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మఫ్టీలో ఉన్న రూరల్ ఎస్ఐ సుధాకర్ బూతులు తిడుతూ రెచ్చిపోయి అంగన్వాడీలపై దాడికి యత్నించారు. ఆయన వైఖరిని నిరసిస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు రైలు ప్లాట్ ఫాం మీద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధాకర్ సిపియం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులపై దాడికి యత్నించారు. అంగన్వాడీలు, ప్రయాణికులు పోలీసులను అడ్డుకున్నారు. రైలు దింపిన అంగన్వాడీలను అరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టుకు నిరసనగా రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పడం దుర్మార మన్నారు. శాంతి యుతంగా 4 రోజులుగా సమ్మె చేస్తున్నా అంగన్వాడీల సమస్యలు పట్టించుకోకపోగా బెదిరింపులకు పాల్పడిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జగనన్నకు చెబుతామని బయలుదేరిన వారిపై నిర్బంధించడం దాష్టికమని చెప్పారు. మఫ్టీలో వచ్చి మహిళలపై దాడి చేస్తూ దుర్భాషలాడిన రూరల్ ఎస్ఐ సుధాకర్ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

పిటిఎం రైల్వే ప్లాట్‌ఫామ్‌పై ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

చేశారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని లేదంటే ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మదనపల్లి ప్రాజెక్టు అధ్యక్షులు డిఆర్ మధురవాణి, సిఐటియు మండల కార్యదర్శి గంగాదేవి, వసుంధర, సుందరి, రత్నమ్మ, లతో పాటు 15 మంది ఉన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీల న్యాయమైన హక్కులు సాధన కోసం విజయవాడ వెళ్తున్న లక్కిరెడ్డిపల్లి అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అక్రమ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్యదర్శి ఓబులమ్మ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎంత దూరమైనా ప్రయాణం చేస్తామని చెప్పారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని అని అన్నారు మధ్యాహ్నం నుంచి లక్కిరెడ్డిపల్లి పోలీసులు తమల్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి సాయంత్రం వరకు ఉంచుకున్నారని. ఎస్ఐ విష్ణువర్ధన్ తమ దగ్గర సంతకాలు తీసుకుని వదిలారని ప్రాజెక్టు కార్యదర్శి అన్నారు **రాజంపేట అర్బన్ :** డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు చేపడుతున్న నిరవధిక సమ్మె ఆదివారానికి 41వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఆదివారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శివరంజని, పార్వతి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా,తంబళ్లపల్లి నియోజక వర్గం ,బి.కొత్తకోట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గత 41 రోజుల నుంచి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, పూర్తిగా విధులకు దూరమై అంగన్వాడీ సెంటర్లను మూసివేసిన విషయం తెలిసిందే. తమన్యాయమైన డిమాండ్లును ప్రభుత్వం వరకు, ఎలాంటి పరిస్థితుల్లో కూడా అంగన్వాడీ సెంటర్లను తెరిచేది లేదని చెప్పారు. అంగన్వాడీలు విధులకు దూరం కావడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లు పరిష్కరించి ఆందోళనను విరమింపజేయాలని కోరారు.

లక్కిరెడ్డిపల్లె : అంగన్వాడీలను అరెస్టు చేసిన పోలీసులు

రాజంపేట : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

ఆర్థిక బకాయిల చెల్లింపులో
అలసత్వం తగదు : యుటిఎఫ్

మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజా శక్తి రాయచోటి

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఉద్యోగులు ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వ మొండి వైఖరి సరైందని కాదని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యా యులు, పెన్షనర్ల పట్ల వ్యవహరిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తూ మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి పిఆర్‌సి బకాయిలు, డిఎ అరియర్లు, సరెండర్ లీవ్ బకాయిలు, ఎపి జిఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేసిన ప్పటికీ వేలాది కోట్ల రూపాయలు ఇంకా చెల్లించకపోవడం బాధాకరమని వాపోయారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించాలని అనేక దఫాలుగా వివిధ రూపాలలో తాలూకా, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిరసనలు తెలియజేసినప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకుండా నిర్లక్ష్యం వహించడం తగదని వారు విమర్శించారు. 11వ పిఆర్‌సికి సంబంధించిన బకాయిలే పెండింగ్ ఉన్నప్పటికీ, ఆర్భాటంగా12వ పిఆర్‌సి కమిటీ వేశారే తప్ప, విధి విధానాలు రూపొందించకపోవడం, వారు తమ కార్యక లాపాలు కొనసాగించడానికి తగిన ఏర్పాట్లు చేయకపోవడం ఉద్యోగ ఉపాధ్యా యులకు మోసం చేయడమేనని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నిటిని చెల్లించి, 12వ పిఆర్‌సి కమిటీకి తగిన విధి విధానాలు రూపొందిస్తూ 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు కె. హేమలత, జిల్లా కోశాధికారి బి. చంద్రశేఖర్, జిల్లా కార్యద ర్శులు అక్రమ్ బాష, భాస్కర్ రెడ్డి, పురం వెంకటరమణ, దావూద్, కె ఆదినా రాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వి సురేంద్ర రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వై. మస్తానయ్య, ఎం రమణయ్య, అజ్మతుల్లా, నీలేష్, సంకా ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్, మండల సహా అధ్యక్షుడు పఠాన్ రఫీ ఖాన్, చిన్నమండెం సహాధ్యక్షుడు కిఫాయతుల్లా పాల్గొన్నారు.

దోపిడీకి కేరాఫ్ అడ్రస్ జగన్ టీం : ఆర్ఆర్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

భూ రక్షణ చట్టం అమలులోకి వస్తే 'మీ భూములు గోవిందా గోవిందా' అని, రాజకీయాలు నీతి నిజాయితీతో చేయాలని దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా జగన్ టీం పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి రమేష్ కుమార్‌రెడ్డి పేరొన్నారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అజ్ఞానంతో తీసుకొచ్చిన భూ రక్షణ చట్టం అనేది చాలా ఆందోళన కలిగించే విధంగా ఉందని పేర్కొన్నారు. భూములకు ఎవరు రక్షణ కల్పిస్తున్నారో ప్రజలను అయోమయంలో పడేసిందని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది ఎక్కడ కనబడడం లేదని, కేవలం ఇసుక దగ్గర నుంచి కొండలను కూడా కరిగించుకొని తినడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి టీం పని చేస్తుందని ఆయన ఆరోపించారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితుల కోసం 27 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు అధికంగా పెంచేసిందని చెప్పారు. 200 యూనిట్ల లోపు కరెంటు ఉచితం అని ఆఖరికి చెత్త పై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రిగా ఈ జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచారని విమర్శించారు. ఏదేమైనా రాబోయేది మాత్రం కచ్చితంగా తెలుగుదేశం పార్టీ నేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమానికి ప్రజలను దగ్గరకు చేస్తామని ఆయన అన్నారు. సామాజిక న్యాయం అని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి 29 మంది దళిత ఎమ్మెల్యేలను బదిలీ చేశారన్నారు. ఇదేనా సామాజిక న్యాయం అంటే జగన్మోహన్ రెడ్డి అని ఆయన ప్రశ్నించారు. చెల్లికి న్యాయం చేయలేని వారు ఇక ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ఎద్దేవ చేశారు. విలువలు లేని వ్యక్తులు రాజకీయాలకు అనర్హులని, వెంటనే వైసిపి ఈ రాష్ట్రం నుంచి రాబోయే ఎన్నికల్లో తరిమికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర బాష, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు నూలివీడు శివారెడ్డి , రాయచోటి రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, సంబేపల్లి మాజీ జడ్పిటిసి మల్లు నర్సారెడ్డి, గాలివీడు మండల నాయకులు సత్యా రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - రాయచోటి

సంక్రాంతి పండగ కార్యక్రమంలో భాగంగా గుదె మారుతి పౌండేషన్ చైర్మన్ గుది మారుతి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తింగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిశాయి. దాదాపు 52 జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ విజేతగా అగ్ని ఆర్మీవాసేస్ సద్దాం -11 జట్టు నిలిచింది. ఈ సందర్భంగా గుదె నాగార్జున, జ్ఞానేంద్ర రెడ్డి, గజ నాయుడు చేతుల మీదుగా విజేతగా జట్టుకు రూ .50,016 ల నగదు, గుది మారుతి పౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్ కప్పును అందజేశారు. రన్నర్‌గా నిలిచిన ఆగ్రీ ఆర్మీ టిం కు రూ .25,116, కప్పును బహుమతిని అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌టో ర్నమెంట్ మొత్తం అద్భుతంగా రాణించిన ఆటగాడు పఠాన్ హుమేజ్ ఖాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మాన్ అఫ్ ది సీరియస్‌గా ఎన్నిక చేసి ట్రోఫీ బహుమతిని అందజేశారు. గుది మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ అద్భుతంగా నిర్వహించిన ఆర్గనైజర్స్ పుచ్చలపల్లి పణి కుమార్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాము ,ఆనిల్ , వెంకట్రామ ప్రసాద్, డేరంగుల ఆనిల్ , శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

రవీంద్రనాథరెడ్డి వ్యాఖ్యలు అర్ధ రహితం

ప్రజాశక్తి - కడప

తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొదటగా పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ పర్యటన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి కమలాపురం ఎమ్మెల్యే ఉలిక్కిపడ్డారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక వట వృక్షం లాంటిదని, వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, బిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారేనని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే చింతకొమ్మదిన్నె జడ్పిటిసి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు, కడప మేయర్ పదవులు అలంకరించిన ప్రస్తుత కమలాపురం వైసిపి ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మీద చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ పిసిసి చీఫ్ షర్మిల మరో 10 రోజుల్లో కడప జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిపారు. ఆ సమయంలో ప్రతి కార్యకర్తతో కలుస్తారన్నారు. విలేకరుల సమావేశంలో పిసిసి డెలిగేట్ పొట్టి పార్టీ చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి మైనార్టీ ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ ఖాన్, ధ్రువ కుమార్ రెడ్డి, పాలగిరి శివ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుండ్లకుంట శ్రీరాములు

'ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలి'

ప్రజాశక్తి - రాయచోటి

ఎపి రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులకు రెండు అసెంబ్లీ సీట్లతో పాటు ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను (రాయచోటి వాసి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణులు సంఘం ప్రధాన కార్యదర్శి, పొలిటికల్ సమన్వయ కమిటీ సభ్యులు దువ్వూరు నరసింహాచారి కోరారు. విజయవాడ కరకట్టలోని నారా లోకేష్ నివాసంలో ఎపి విశ్వబ్రాహ్మణులు సంఘం నాయకులతో పాటు ఎపి వడ్డెర సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఇడగొట్టు నాగేశ్వర రావుతో కలిసి దువ్వూరు నరసింహ చారి గౌరవప్రదంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహ ఆచారి మాటా డుతూ విశ్వబ్రా హ్మణులకు అన్ని రంగాలలో రాణించేందుకు ప్రోత్స హించాలన్నారు. సామాజిక న్యాయం కులాల ప్రాతిపదికన సీట్లు కేటా యించి నప్పుడే అది సాధ్య పడుతుందన్నారు.ఎంతో మంది రాజకీయ రంగంలో రాణించి ప్రజలకు సేవలు చేసేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారాన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించడం వల్ల పార్టీకి రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందనే అభిప్రాయాలను వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ అని రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సంతృప్తి కరంగా అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తాయరని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ స్థానాన్ని కచ్చితంగా ఇవ్వనున్నట్లు లోకేష్ స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు ఎమ్మెల్యే స్థానాలను ఎక్కడా కేటాయించాలనే నిర్ణయాన్ని కూడా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన వెంట విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా సెక్రెటరీ సుజాత,ఒంగోలు జిల్లా మహిళా అధ్యక్షులు కె. సోనాక్షి, గట్టు శ్రీనివాసులుచారి, నందవీర ప్రసాద్,బొల్లాపల్లి సిద్దు, ధనాల్ కోట శోభన్ బాబు పాల్గొన్నారు.

నారా లోకేష్‌తో విశ్వబ్రాహ్మణులు

అంబేద్కర్ దేశానికి గర్వకారణం

విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే నవాజ్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లి

బాబా సాహెబ్ అంబేద్కర్ విశ్వ విజ్ఞాని అని, అయన భారతదేశంలో జన్మించడం యావత్ భారత జాతికీ గర్వకారణం అని, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా స్పష్టం చేశారు. ఆదివారం మదనపల్లి రూరల్ మండలం, వేంపల్లి ఎస్‌సి కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించారు. బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, నవాజ్ బాషా అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా విగ్రహ కమిటీ చైర్మన్ చాట్ల బయన్న అధ్యక్షతన నిర్వహించిన విగ్రహావిష్కరణ మహోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వేల సంవత్సరాల నుంచి దేశంలో కొనసాగుతున్న అసమానతలు రూపుమాపే దివ్య ఔషదం లాంటి గొప్ప రాజ్యాంగాన్ని అంబేద్కర్ మన దేశానికి అందించారని చెప్పారు. పాలకులు, ప్రజలు రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి జీవిస్తే మన దేశం అత్యున్నత స్థాయికి చేరుకుంటుందని చెప్పారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలకు భారత జాతి ఎప్పటికీ రుణపడి ఉంటుందని తెలిపారు. శివప్రసాద్ మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సర్వం కోల్పోయిన మన దేశానికి పునాదుల నుంచి మరమ్మతులు చేసిన మేథో తరంగం అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబురెడ్డి, బోర్‌వెల్ వెంకటేష్, నారాయణ రెడ్డి, వేంపల్లి సర్పంచ్ సువారపు అదేమ్మ, ఎంపిటిసి సుభాషిణి, కౌన్సిలర్ రేణుకమ్మతోపాటు విగ్రహ కమిటీ సభ్యులు బండ వెంకటరమణ, బైనేని సురేష్, పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా

28న వాల్మీకిసంఘం కార్యాలయం ప్రారంభం

మాట్లాడుతున్న పులిశ్రీనివాసులు

మదనపల్లి : పట్టణంలో ఈనెల 28న వాల్మీకి సంఘం కార్యాలయం ప్రారంభించనున్నట్లు వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక నక్కలదిన్నె షటిల్ కోర్టులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకుల విద్య, వైద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, చైతన్యం - అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పారు. మరింత అందుబాటులో ఉండి వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో వాల్మీకి సంఘం నియో జకవర్గ కార్యాలయాన్ని స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీలో ఏర్పాటు చేశామన్నారు. ఇకపై వాల్మీకి సంఘం ఉచిత సర్టిఫికెట్లను కార్యాలయంలో పొందవచ్చని పేర్కొన్నారు. వాల్మీ కుల ప్రధాన డిమాండ్ ఎస్టీ పునరుద్ధరణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వాల్మీకి సంఘం కార్యాలయ ప్రారంభోత్సవానికి ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేసి కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని తెలియజేసారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సద్దుల జయసింహ, మదనపల్లి పట్టణ అధ్యక్షులు వలసల మంజునాథ్, 35 వార్డు అధ్యక్షులు నరసింహులు, రెండవ వార్డు మహిళా అధ్యక్షులు అరవ నిర్మలమ్మ, పాల్గొన్నారు

3న మదనపల్లిలో బహుజన రాజ్యాధికార సదస్సు

ప్రజాశక్తి- మదనపల్లి

మాట్లాడుతున్న గౌతమ్

బహుజన సమాజ్ పార్టీ మదనపల్లి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న బహుజన రాజ్యాధికార సదస్సు నిర్వహించినట్లు డిఎస్‌పి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ వెల్లడించారు. బహుజన సమాజ్ పార్టీ మదనపల్లి అసెంబ్లీకి సంబంధించిన ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించా. ఈ సందర్భంగా బందెల గౌతమ్ కుమార్ మాట్లాడుతూ సదస్సు మదనపల్లె మిషన్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ జెసిఎం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా బిఎస్‌పి రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి,ు రాష్ట్ర నాయకులు రానున్నట్లు తెలిపారు. బహుజన రాజ్యాధికార సదస్సు రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిఎస్‌పి మదనపల్లి నాయకులు అందరూ కష్టపడి పనిచేసి సమావేశాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని తెలియజేశారు. సమావేశంలో బిఎస్‌పి నాయకులు పాల్గొన్నారు

టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం
-ముక్కా సాయివికాస్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తీసుకొస్తామని టిడిపి యువనాయకులు ముక్కాసాయి వికాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన అంతమై టిడిపి ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని అన్నారు. రాష్ట్రంలో బటన్ నొక్కుడు కార్యక్రమాలు మినహా మరే అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేడు వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడుతున్నారని అన్నారు. ఇసుక మాఫియాతో ప్రజలకు ఇసుక దొరకడం కరువైందని, ఇసుక బంగారంను తలపిస్తూ భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు, చెత్తపన్ను, లిక్కర్ ధరల పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించలేక ఆకాశాన్ని అంటించిన ఘనత వైసిపిదేనని అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. మంగళగిరిలో టిడిపి అధినేత చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు సమక్షంలో నియోజకవర్గం నుంచి భారీగా టిడిపి చేరారని అన్నారు. టిడిపిలో చేరిన వారిలో చిట్వేలి మండలం కెఎస్ అగ్రహం నుంచి వైస్ ఎంపిపి సుబ్రమణ్యంరెడ్డి, పోలేపల్లి యంపిటిసి పామూరి కృష్ణయ్య, రాజుకుంట యంపిటిసి నాన్నబాల నాగార్జున, తిమ్మాయపాలెం నుంచి ఆదినారాయణ, చిన్న ఓరంపాడు పంచాయతి సర్పంచ్ గద్దె సిద్దమ్మ, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, ఉపసర్పంచ్ యర్రబాపు రవిశంకర్ రెడ్డి, పుల్లంపేట మండలం అనంతంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి జయరామ్‌రెడ్డి(అలియాస్) మురళిరెడ్డి , షేక్ మొహమ్మద్ ఆలీ, గారాలమడుగు గ్రామ పంచాయతీ సర్పంచ్ జె.సుబాషిణి, పుతనవారిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గజపతి, ఓబులవారిపల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, వై. కోట మాజీ సర్పంచ్ బాలాజి ఉన్నారని తెలిపారు. అందరం కలిసి కట్టుగా పనిచేసే నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేస్తామని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చీకటిపల్లి సర్పంచ్ సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చీకటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రంగనాదపురంలో సర్పంచ్ అధ్యక్షతన ఆదివారం వికసిత్ సంకల్ప్ భారత్ యాత్ర జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, పలు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి పరశురాం, ఎంఇఒ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎపిఒ సుజాత, విఆర్‌ఒ నరేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** మండలంలోని డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయాలని సర్పంచ్ మంజుల కోరినట్లు తెలిపారు.ఆదివారం మండలంలోని ఏనుగొండపాల్లెం పంచాయితీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు.రాజ్యసభ సభ్యులు సుమిర్ సింగ్ సోలంకి పాల్గొని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అ కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాలు అర్హులు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని, ఎవరైనా అర్హత కలిగి ఉండి పథకాలు అందని వారు నిర్మొహమాటంగా సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే సర్పంచ్ మంజుల మహిళ డ్వాక్రా మహిళలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ఎంపిని కోరారు.కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సెబ్ సిఐ మల్లిక బదిలీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు ఎస్ఇబి స్టేషన్‌లో సెబ్ సిఐగా విధులు నిర్వహిస్తున్న మల్లిక కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం లోని పెద్దమండెం, తంబళ్లపల్లి, పిటిఎం, ములకలచెరువు మండలాలకు చెందిన ప్రజలు ఎంతో సహకరించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎసిఇబి స్టేషన్‌కు నూతన సిఐని నియమించాల్సి ఉంది.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.7 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్యమడుగు పంచాయతీ చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో వెలసిన ఆవుదేవర దేవస్థానం ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.7 కోట్లు రూపాయలు మంజూరైనట్లు దేవాదాయ శాఖ ఉద్యోగులు అంకన్న, కొండకిట్ట, సర్పంచ్ శ్యామలమ్మలు తెలిపారు. ఆదివారం ఆలయంలో కన్యమడుగు రెడ్డివారి పల్లి దాయాదులు సమావేశం నిర్వహించారు. పురాతన చరిత్ర కలిగిన ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ,ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ల కృషితోనే నిధులు విడుదల కావడం హర్షనీయమని కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం వాటాగా రూ.1.5లక్షలు చెల్లించేందుకు కన్యమడుగు రెడ్డివారిపల్లి దాయాదులందరూ ఏక నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో రవిశంకర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, బెంగళూరు మల్లికార్జున్ రెడ్డి, రామలింగారెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

విజేతలకు ట్రోఫీ అందిస్తున్న జగన్మోహన్‌రాజు

యువత క్రీడల్లోనూ రాణించాలని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. వీరబల్లిలో జరిగిన అంబేద్కర్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టోర్నీ విజేతగా నిలిచిన చింతపల్లి లెవెన్ జట్టుకు రూ.20116 నగదు, ట్రోఫీని, రన్నర్‌గా నిలిచిన బలిజపల్లి వారియర్స్ జట్టుకు రూ.10116లు, ట్రోఫీని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడల పట్ల ప్రావీణ్యత ఎంతో ఉందన్నారు. ఇలాంటి క్రీడల పట్ల వారి ప్రతిభావంతులైన క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో కూడా ఆడి గెలుపొందాలని క్రీడాకారులకు సూచించారు. ఇలా క్రీడలు నిర్వహించే వారికి తమ వంతు ఆర్థిక సాయం అందజేస్తానని చెప్పారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా చేపట్టిన నిర్వాహకులు రమణ, నరేంద్ర, బాలయ్యలను అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు భాను గోపాల్‌రాజు, మల్లి టిడిపి సర్పంచ్ సోమారపు నాగార్జున చారి, మండల నాయకులు రెడ్డప్పరెడ్డి, భూసయ్య నాయుడు, ఆంజనేయులు రెడ్డి, దుర్గమ్మ ఆంజనేయులు, భాస్కర్ రాజుపాల్గొన్నారు.

క్రీడలు ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - కడప

ఉద్యోగపరంగా నిత్యం బిజీగా ఉండే వారికి కాస్త ఊరటనిచ్చేందుకు, ఆరోగ్యపరంగా క్రీడలు మంచి వ్యాయామం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి అన్నారు. ఆదివారం కడప నగర శివార్ల పట్లలోని పివిటర్ స్పోర్ట్స్ క్లబ్ సెంటర్‌లో న్యాయ మూర్తులకు, న్యాయవాదులకు, న్యాయ శాఖ ఉద్యోగులకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయని అన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. హోరాహోరీగా నిర్వహించిన పోటీలో న్యాయవాదులైన మంజునాథ్, మహేంద్ర నాయక్ విజేతలుగా నిలిచారు. రామారావు, నాగరాజు రన్నర్లుగా నిలిచారు.

రాజంపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S No. 137 /2023

1. ఆవులకుంట రెడ్డమ్మ, భర్త వెంకటరమణ,
2. ఆవులకుంట యోగాంజనేయులు, తండ్రి వెంకటరమణ,

ఇద్దరూ ఎగువ వడ్డేపల్లి, కుర్నూతల గ్రామం, లక్కిరెడ్డిపల్లి మండలం. ..... వాదులు

వాది గారి సావిత్రి తండ్రి చిన్న గంగులు, వయసు 38 సంవత్సరములు, హిందూ మడ్డిపల్లి గ్రామం లక్కిరెడ్డిపల్లి మండలం......5 వ ప్రతి వాది.

SAMANS & Notice to Respondent No. 5.

పైవాదులు మీ పైన ఇంజక్షన్ నిమిత్తం ప్రతివాదుల పైన దావా దాఖలు చేసినారు. IA.NO.1001/2023 కాదా మీ పేరు ... తేది 23-01-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు ... కోర్టుకు హాజరు కావలెను ...

ఇట్లు, పెట్ల రెడ్డప్ప, బి.ఎ., బి.ఎల్.

వాదుల తరఫు న్యాయవాది, లక్కిరెడ్డిపల్లి

నగర పంచాయతీ భవన నిర్మాణం పూర్తయ్యేనా?

- అడ్డుగా పాలశీతలీకరణ కేంద్రం
- పరిష్కారానికి చర్యలు : కమిషనర్ పి.ఆర్.మనోహర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అడ్డుగా ఉన్న పాల శీతలీకరణ కేంద్రం

ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించే సమయంలో అడ్డుగా వస్తున్న లారీ

నగర పంచాయతీ భవనం నిర్మాణానికి పాలశీతలీకరణ కేంద్రం అడ్డుగా మారింది. బి.కొత్తకోట పంచా యతీగా ఉన్న రోజుల్లో 2009లో పాల సేకరణ కేంద్రానికి అప్పటి పాలక మండలి ఎటువంటి రుసుం లేకుండా పాల సేకరణ కోసమని భవనాన్ని కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి బాడుగ చెల్లించకుండా ఇన్నేళ్ల పాటు పాల శీతలీకరణ కేంద్రానికి కేటాయించడం మంచి విషయమే. నగర పంచాయతీ ఆవరణంలో పంచాయతీకి సంబంధించిన స్థలంలో ఉండడంతో ఇప్పుడు భవన నిర్మాణానికి ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలంటే చేసిన పనే రెండు దపాలుగా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల ఓ కార్యక్రమం నిర్వహించే క్రమంలో స్టేజి ఏర్పాటు చేసుకునే సమయంలో పాల కేంద్రానికి తీసుకువెళ్లే ఆటోలు, లారీలు రావడంతో వేసిన స్టేజిని తొలగించి, ఆటోలు, లారీలు వెళ్ళిన తర్వాత మళ్లీ స్టేజీ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని నగర పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయం పాల సేకరణ అధికారులకు తెలియపరచి గడవు కూడా ఇచ్చినా ఇంకా పాల సేకరణ కేంద్రం మరొక చోటకి ఇంకా మార్చకపోవడంతో నగర పంచాయతీ నూతన భవనం నిర్మాణం జరిగేనా.. అనే సందేహాలు ప్రజల్లో మొదలవుతున్నాయి. భవనం పనులు మొదలు పెట్టే లోపు ఎన్నికల కోడ్ కూడా వస్తుందని పలువురు ప్రజల అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై కమిషనర్ పి.ఆర్ మనోహర్‌ను వివరణ కోరగా ఈ విషయాన్ని పాలకేంద్రం వారికి తెలియపరిచామని, వారు మరొకచోట ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరగా మరొకచోట పాల సేకరణ కేంద్రం ఏర్పాటు చేసుకుంటే నగర పంచాయతీ భవనం నిర్మించేందుకు శ్రీకారం చుడతామని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపిని ఆదరించండి :'కసూర్తి'

టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను అందిస్తున్న కస్తూరి విశ్వనాథనాయుడు

ప్రజాశక్తి-చిట్వేలి

రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలంతా టిడిపిని ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోలోపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన 'బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కెకె చౌదరి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడి బంగారు భవిష్యత్తుకు టిడిపిని ఆదరించి చంద్ర బాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. వైసిపి అధికారంలోకి వచ్చి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకులతో పాటు విద్యుత్ బిల్లులు, బస్సు చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో బుంగటావుల రాజశేఖర్ నాయుడు, నరసింహారాజు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు పూలెల రమేష్ నవీన్ ,రైల్వే కోడూరు నియోజకవర్గ మహిళా నాయకులు సుప్రజ, ఎస్‌సి సెల్ మండల నాయకులు ఈశ్వరయ్య, పెంచలయ్య, పార్లమెంట్ అధికార ప్రతినిధి బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- బి.కొత్తకోట

విజేతలకు బహుమతి అందిస్తున్న యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు

వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో బండమీదపల్లిలో నిర్వహించిన ఓపెన్ కబడ్డీ పోటీలు ఆదివారం హోరాహోరీగా ముగిశాయి. దాదాపుగా 30 టీంలు ఈ టోర్నమెంటులో పాల్గొన్నాయి. ఇందులో మొదటి బహుమతిని బండమీదపల్లి-ఎ జట్టు కైవసం చేసుకోగా ఆ జట్టుకు పులికల్లు తలారి మంజునాథ్ రూ.10,116నగదు బహుమతిని ప్రదానం చేశారు. రెండవ బహుమతి బండమీదపల్లి-బి టీం కైవసం చేసుకోగా ఆ జట్టుకు ఎగువపల్లి రామచంద్ర రూ.5,116 నగదు బహుమతిని అందించారు. మూడవ బహుమతిని తుమ్మరకుంటవారి పల్లి టీం కైవసం చేసుకోగా ఆ జట్టుకి యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ రూ.2,116 నగదు బహుమతిని, నాలుగవ బహుమతి కొండికొండ గంగాభవాని టీం కైవసం చేసుకోగా,ఆ జట్టుకి రూ.1,116 నగదు బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కబడ్డీ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి,బహుమతులకు నగదు ప్రదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, లక్ష్మీనరుసు, రమణ, నాగన్న, గణేష్, సుధాకర్, హరీష్, ఎర్రప్ప, రవీంద్ర, ఎగువపల్లి రామచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు మరోసారి అవకాశం ఇవ్వొద్దు :'చమర్తి'

సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్మోహన్ రాజు

ప్రజాశక్తి-వీరబల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వద్దని, ఒకసారి ఇచ్చినందుకే రాష్ట్రం అధోగతి పాలవడంతో పాటు అభివృద్ధిలో ముప్పై ఏళ్ల వెనక్కి పోయామని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం వీరబల్లిలోని టిడిపి కార్యాలయంలో మాట్లాడుతూ వైసిపి పాలన అంతా దాచుకో దోచుకో అన్న సామెతల ఉందన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా పాలించి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కేవలం మాటల చెప్పి వాగ్దానాలు అమలు పరచడంలో విఫలమయ్యారని అన్నారు. మద్య నిషేధం చేయకుండా మద్యంతోనే దోపిడీ చేశారని విమర్శించారు. చెత్త మీద పన్ను వేయడం, అన్ని వస్తువుల పైన ధరలు పెంచి సామాన్లపై భారం పెంచారన్నారు. ఎక్కడ చూసినా భూకబ్జాలు, ఇసుక దందాలు, బెదిరింపు దోరణిలు కనిపిస్తున్నాయని అన్నారు. రాజధాని లేకుండా చేసినా ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఈనెల 27న పీలేరులో జరిగే రా కదిలి రా సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు భానుగోపాల్‌రాజు. సర్పంచ్ నాగార్జున చారి, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, నాయకులు రెడ్డప్ప రెడ్డి, దుర్గామాంజనేయులు ఆంజనేయులు రెడ్డి, భాస్కర్ రాజు, జై చంద్రారెడ్డి, పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 23 నుండి గోవాలో జరుగుతున్న అంతర్రాష్ట్ర సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు మైదుకూరు మున్సిపాలిటీ పరిధి లోని చిన్నయ్యగారిపల్లె గ్రామానికి చెందిన అంకిరెడ్డిపల్లి కశ్యప్‌రెడ్డి ఫేస్ బౌలింగ్ విభాగంలో రాష్ట్రం తరపున ఎంపికయ్యాడు. కశ్యప్‌రెడ్డి మైదు కూరులోని లిటిల్ స్కాలర్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా కశ్యప్‌రెడ్డి మాట్లా డుతూ కడప జిల్లా క్రికెట్ అసోసి యేషన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. గోవాలో జరుగుతున్న మ్యాచ్‌లలో మంచి ప్రతిభ కనబరుస్తానని ధీమా వ్యక్తం చేశాడు. రాష్ట్ర జట్టులో కశ్యప్‌రెడ్డి స్థానం సంపాదించడంపై గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు 'గండి' చైర్మన్‌గా కృష్ణతేజ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామానికి చెందిన కావలి కృష్ణతేజ సోమవారం ఉదయం గండి దేవస్థానం చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చక్రాయపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి దేవస్థానం నూతన పాలక మం డలిని 11 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి సహకారంతో రాయలసీమ కాపునాడు యవజన సంఘం ఉపాధ్యక్షుడు కావలి కృష్ణతేజను గండి దేవస్థానం చైర్మన్‌గా నియమించారు. దేవదాయ శాఖ అధికారులు పాలక మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. పాలక మండలి సభ్యులుగా వేంపల్లెకు చెందిన శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరు కానున్నట్లు కృష్ణతేజ తెలిపారు. ప్రమాణస్వీకారానికి వేంపల్లె, చక్రాయపేట మండలాల వైసిపి నేతలు, ప్రజలు అందరూ హాజరు కావాలని కోరారు.

మత్స్యకారుల జీవనోపాధి కోసమే..

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మత్స్యకారుల జీవనోపాధి కోసమే బ్రహ్మంసాగర్‌లో చేప పిల్లలను వదులుతున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో పెంచిన చేప పిల్లలను ఆయన ఆదివారం బ్రహ్మంసాగర్‌లో వది లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభి వృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. మత్స్యశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శాంతి మా ట్లాడుతూ రెండు లక్షల 50 వేల చేప పిల్లలను బ్రహ్మంసాగర్‌లో వదిలినట్లు తెలి పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సాయి ప్రత్యూష, మత్స్యశాఖ అధికారి కిరణ్, సూపరింటెండెంట్ మల్లికార్జున, ఎంపిపి వీర నారాయణరెడ్డి, జాతీయ మత్స్య కారుల సంఘం కడప జిల్లా అధ్యక్షులు సోమయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఉపకరణాలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వీధి దీపాల సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో తన సొంత నిధులు రూ.25వేలు వెచ్చించి 4వ వార్డు కౌన్సిలర్, జేసియస్ ఇన్‌ఛార్జి పార్నపల్లి కిషోర్ వీధి దీపాల విద్యుత్ ఉపకరణాలను ఆదివారం వితరణ చేశారు. వాటిని లైన్‌మెన్ శంకర్‌రెడ్డికి అంద జేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ వార్డులో ఏ సమస్య ఉన్నా ప్రజలు తన దృష్టికి తెస్తే వెంటనే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

28 నుంచి భవన నిర్మాణ కార్మికుల మహాసభలు

ప్రజాశక్తి-వేంపల్లి

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో ప్రొద్దుటూరులో జరిగే 5వ మహాసభలను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ, ఉపాధ్యక్షుడు దస్తగిరి కోరారు. ఆదివారం వేంపల్లెలో మహాసభలకు చెందిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నూతన ఇసుక విధానం పేరుతో ఇసుక కొరత ఏర్పడిందన్నారు. కార్మికులు రమేష్

'రాజకీయ ప్రత్యర్థులిరువురూ అసమర్థులే'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

'నా రాజకీయ ప్రత్యర్థులైన వరదరాజులరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇరువురూ అసమర్థులే' అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. సగర (ఉప్పర) కులస్తులు వివాహాలు చేసుకునేందుకు అవసరమైన కల్యాణమండపం నిర్మాణానికి 1.25ఎకరాల భూమిని కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే తన సొంత నిధుల నుండి రూ.75లక్షలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలోనూ, అనంతరం విడిగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి వ్యాపారస్థులపై తాను పోలీసులతో దాడులు చేయించి నగదును స్వాధీనం చేసుకునేలా చేస్తున్నానని ఇరువురు చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఈ విధంగా చేయడం వ్యాపారులను ఇబ్బదిపెట్టడమే అని తాను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ద్వారా సిఎంకు తెలిపినానని, ఈ విషయమై మంగళవారం డిజిపిని కలువబోతున్నానన్నారు. పోలీసుల దాడులు రాష్ట్రవాప్తంగా జరుగుతున్నాయన్నారు. తనపై రాజకీయంగా బురదజల్లేందుకు ప్రవీణ్‌రెడ్డి, వరదరాజులరెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, సగర సంఘ నాయకుడు ఉప్పర మురళీధర్ పాల్గొన్నారు

ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని హెచ్‌ఎంఎం ఉన్నత పాఠశాలలో 1983లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సమావేశానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాంతాలలో ఉన్న వారు అందరూ ఒకే దగ్గరకు జరగడం ఎంతో సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఉంగరాల కృష్ణ, చల్లానాగేంద్ర, లీలాకర్, మునికృష్ణ, నారాయణరావు, ఆంజనేయరాజు, మహాదేవ రెడ్డి విజయ్ బాబు, విజయ్ కన్నా, నాగవేణి,అనురాధ, ధరణి, శైలేష్ కన్నా,భ్రమరాంబ, ఉమా, పూర్వ విద్యార్థులంతా గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

వీరపనేని వెంకటయ్య నాయుడు

టిడిపితోనే సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి మండల నేత, బోటుమీదపల్లి సర్పంచ్ వీరపనేని వెంకటయ్యనాయుడు అన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలన అంతమై టిడిపి అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. ప్రజాశక్తితో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బటన్ నొక్కుడు కార్యక్రమాలు మినహా మరే అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేడు వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక మాఫియాతో ప్రజలకు ఇసుక దొరకడం కరువైందని..ఇసుక బంగారంను తలపిస్తూ భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసిన ప్రభుత్వం ఇదేనన్నారు. ఒక వైపు బటన్ నొక్కి ప్రజలకు ఆర్థిక భరోసా అందిస్తున్నామని చెబుతూనే. మరో చేత్తో విద్యుత్ చార్జీలు, చెత్తపన్ను, లిక్కర్ ధరల పెంపు, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించలేక ఆకాశాన్ని అంటించిన ఘనత వైసిపిదేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకుల దాడులు, భూకబ్జాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని విమర్శించారు.టిడిపి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమానికి అడుగడుగనా అనూహ్య స్పందన లభిస్తోందని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు దూరదృష్టి కలిగిన నేత అని, సంపదను సృష్టించి రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయగల దమ్మున్న పాలకుడని అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రజారంజక పాలన అందిస్తారన్నారు. మహాశక్తి పథకం ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నుంచి 60 సంవత్సరాల లోపు మహిళలకు నెలకురూ.1500లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పేరుతో కుటుంబంలో విద్యార్థులు ఎంత మంది ఉంటే అందరికీ ఏటా రూ.15వేలు స్కాలర్ షిప్ ఇస్తారని చెప్పారు. యువగళం పేరుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు , బిసిలకు రక్షణ చట్టం, పూర్ టు రిచ్ పథకాలు ఎంతగానో ప్రజలకు ఉపయోగపడతాయని అన్నారు. మండల పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నియోజక వర్గ వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

మండలంలో జయచంద్రారెడ్డి విస్తృత పర్యటన

పెద్దమండ్యం : తెలుగుదేశం పార్టీ నియోజవర్గ నాయకుడు జయచంద్ర రెడ్డి పెద్దమండ్యం మండలంలో ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలిచెర్ల యుప్పవనములోపోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం తాటిమాకులపల్లి, కలిచెర్ల, సిద్దవరం, పెద్దమండ్యం, మందలవారిపల్లి, తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు ఆయన కలిశారు. ఈ నెల27న పీలేరులో జరుగుతున్న టిడిపి అధినేతచంద్రబాబు అధ్యక్షత జరిగే రా..కదలిరా కార్యక్రమానికి ప్రతి కార్యకర్త వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. టిడిపి, జనసేన ,కార్యకర్తలు అందరమూ కలిసి అధినేత చంద్ర బాబును ముఖ్యమంత్రి చేయడానికి కృషి చేయాలని కోరారు, కార్యక్రమంలో స్థానిక నాయకులు సిద్దవరం ప్రసాద్, తాటిమాకులపల్లి రామకృష్ణ రెడ్డి, బాబు రెడ్డి, చల్లపల్లి వేణుగోపాల్ రెడ్డిసయ్యద్ షావల్లి, గిరిధర్ రెడ్డి, మస్తాన్ రెడ్డి, నరసింహా రెడ్డి, శంకర్ రెడ్డి, సైపుల్లా పాల్గొన్నారు.

టిడిపి హయంలోనే బిసిలకు రక్షణ

గాలివీడు : టిడిపి ప్రభుత్వం హయాంలోనే బిసిలకు రక్షణ ఉంటుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గాలివీడు పట్టణంలో నిర్వహించిన జయహో బిసి కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలు తెలుగుదేశం పార్టీకి వెన్నుముక లాంటి వారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసమే టిడిపి ఆవిర్భవించిందన్నారు. బిసిలకు సముచిత స్థానం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లు రామంజులు, మాజీ సర్పంచ్‌లు, యంపి టిసిలు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జయహో బిసి కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, రమేష్‌కుమార్‌రెడ్డి

క్రైం కార్నర్

రైలు కిందపడి బాలిక దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లి

రైలు కింద పడి బాలిక మృతి చెందిన విషాదకర ఘటన కురబలకోట మండలంలో జరిగింది. కదిరి రైల్వే ఎస్ఐ రహీం కథనం మేరకు వివరాలు.. కురబలకోట మండలంలోని సింగన్న గారిపల్లికి చెందిన రైతు శంకర కూతురు పల్లవి(15) కు మతి స్థిమితం సరిగాలేక శనివారం సాయంత్రం ఇంటి నుంచి ఊరికి సమీపానికి వెళ్ళిందని అన్నారు. ఆరు గంటల సమయంలో ధర్మవరం వైపు నుంచి తిరుపతికి వస్తున్న ఓ రైలుకు ఎదురుగా నిలబడటంతో రైలు ఢీకొని పల్లవి అక్కడి కక్కడే మృతి చెందిందని తెలిపారు. స్థానికుల సాయంతో కుటుంబీకులు సమాచారం అందించారని అన్నారు. వెంటనే ఘటన జరిగిన సింగన్న గారిపల్లి వద్దకు చేరుకొని మృత దేహాన్ని పరిశీలించి శవపరీక్ష నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

ఆటో బోల్తా : వృద్ధుడి మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట వద్ద చిన్నంపల్లి గ్రామానికి చెందిన గూడూరు నాగరాజు (85) తన మనవడి పెళ్లి రాజంపేట పోలి చెరువు కట్ట వద్ద ఉన్న వేణుగోపాలస్వామి గుడిలో పెళ్లి చూసుకొని తిరిగి వస్తూ తన కుమారుడే ఆటో తోలుతూ ఉన్న సమయంలో హఠాత్తుగా ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న గూడూరు నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మనవడి పెళ్లికి వెళ్లి వస్తూ అనంత లోకాలకు వెళ్లిన నాగరాజు మృతి పట్ల గ్రామస్తులు సంతాపం ప్రకటించారు. అదే సమయంలో ఆటోలో ఉన్న మరో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.